పింఛన్ పెరుగుదలతో సర్వత్రా హర్షం

ప్రొద్దుటూరు : నియోజకవర్గంలో ఆదివారం వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పెంచిన పింఛన్ పంపిణీ చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని పెంచడంతో లబ్ధిదారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా పింఛన్ల మొత్తాన్ని పెంచుతున్నారు. గత ప్రభుత్వంలో రూ.2000 మాత్రమే ఉన్న పింఛన్ మొత్తాన్ని తొలి ఏడాది రూ.2,250, రెండో ఏడాది రూ.2,500, ప్రస్తుతం రూ.2,750కి పెంచారు. వచ్చే ఏడాదికి ఈ మొత్తం రూ.3 వేలకు పెంచనున్నారు. మున్సిపాలిటీలో 15,290, ప్రొద్దుటూరు మండల పరిధిలోని 13,109, రాజుపాళెం మండలంలో 4,511, నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన 887 పింఛన్లు కలిపి మొత్తం 33,797 పింఛన్లు ఉన్నాయి.

నేడు ఎమ్మెల్యేచే పంపిణీ

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం ఉదయం 9 గంటలకు కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మున్సిపాలిటీకి సంబంధించి 412, ప్రొద్దుటూరు మండలానికి 369, రాజుపాళెం మండలానికి 106 కలిపి మొత్తం 887 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. రూ.2,750 ప్రకారం వీరికి పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

రాజుపాళెం : తొండలదిన్నెలోని పింఛనుదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి ఆదివారం పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఏడాదికోసారి పింఛను డబ్బులు రూ.250 పెంచుతామని చెప్పిన సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గుద్దేటి సుభాషిణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుద్దేటి రాజారాంరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ చెమికెల కొండారెడ్డి, పార్టీ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వలంటీర్లు, పింఛనుదారులు


పింఛన్లను అందిస్తున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

పింఛన్ల పంపిణీ

దువ్వూరు : మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామంలో ఆదివారం ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7,635 మంది పింఛన్‌దారులకు పెంచిన రూ.2,750 పింఛన్ అందించినట్లు తెలిపారు. కొత్తగా 175 పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, పింఛన్‌దారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్న ముఖ్యమంత్రి

చాపాడు : ఎన్నికల హామీల్లో చెప్పిన హామీల మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. రూ.2,500ల నుంచి పెరిగిన రూ.2,750ల పింఛన్ డబ్బులను ఆదివారం మండలంలోని ఖాదర్‌పల్లె, లక్ష్మీపేట గ్రామ సచివాలయాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. చాపాడు మండల వ్యాప్తంగా 177 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరి పింఛను తొలగించలేదన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మాదిరి కాకుండా చెప్పిన హామీలన్నీ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఏడాది మరో రూ.250లు పెంచి రూ.3వేలు పింఛన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, లక్ష్మీపేట సర్పంచ్ శ్రీవిద్య, ఖాదర్‌పల్లె సర్పంచ్ షమీబ్ భాను, గ్రామ సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వులు

గోపవరం : ప్రభుత్వం ప్రతినెల ఇస్తున్న పింఛన్‌ను రూ.250 పెంచి అవ్వాతాతలకు ఇస్తుండటంతో వారి ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. విడతల వారీగా రూ.3 వేలు పింఛన్ పెంచడం జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.2500 నుంచి రూ.2750లకు పెంచుతూ జనవరి 1 నుంచే పంపిణీ చేస్తుండటంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. వలంటీర్లు తలుపుతట్టి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. అర్హులైన వారికి సంబంధించిన పింఛన్లు ప్రభుత్వం తొలగించిందని ప్రతిపక్షాలు కోడైకూస్తున్నా ఎక్కడా కూడా అర్హులకు సంబంధించిన పింఛన్లు తొలగించకపోవడంతో వారి విమర్శలు బెడిసికొట్టాయి.

పింఛన్ పంపిణీ

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వం పెంచిన కొత్త పింఛన్ నగదును ఆదివారం మండలంలోని పలు గ్రామ పంచాయతీలో సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో వలంటీర్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం రూ. 2500 నుంచి రూ. 2750 పెంచడంతో అవ్వాతాలు ఆనందం వెల్లిబుచ్చుతున్నారు. అలాగే కన్వీనర్లు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మల్లేపల్లె పంచాయతీలో ఉపసర్పంచ్ సి.కొండారెడ్డి, నాగిశెట్టిపల్లె సర్పంచ్ అనంతరెడ్డి, రేకలకుంటలో మండల ఉపాధ్యక్షురాలు కోనపులి సుహాసిని, బి.మఠంలో కన్వీనర్లు మనోహరాచారి, ముక్కల పద్మావతి, జోగయ్య, గుండాపురం రమణారెడ్డి, లింగాలదిన్నె పెంచల్‌రెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.


ఖాదర్‌పల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది


గోపవరం : సూరేపల్లెలో ఆనందంగా పింఛన్ తీసుకుంటున్న వృద్ధుడు


చెంచయ్యగారిపల్లెలో కన్వీనర్ సి.కొండారెడ్డి చేతుల మీదుగా పంఛన్ పంపిణీ

4న తలనీలాల సేకరణకు వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి, బద్వేలు మండలం లంకమల రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో తలనీలాల సేకరణ కోసం ఈనెల 4వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సి.శివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, మిగిలిన రోజుల్లో తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని బద్వేలు దేవాదాయశాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునేందుకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, అలాగే మార్చి 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 వరకు తలనీలాలు సేకరించేందుకు వేలంపాటలో పాల్గొనేందుకు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే లంకమలలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 4వ తేదీ బుధవారం సాయంత్రం 3 గంటలకు వేలంపాట ఉంటుందన్నారు. ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు తలనీలాల సేకరణకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.25 వేలు, మార్చి17 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ వరకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిపాజిట్ నగదు రూపంలో చెల్లించాలని, హెచ్చు పాటదారుడు వేలంపాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి మొత్తం నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. అలా చెల్లించని యెడల పాటదారుని డిపాజిట్‌ను అపరాధ రుసుము కింద దేవస్థానం ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం దేవాదాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి


మహాలక్ష్మి సమేత చెన్నకేశవాలయం వద్ద ఏర్పాటు చేసిన సెట్టింగ్


ఏర్పాటు చేసిన క్యూలైన్

తెల్లవారుజాము 3 గంటల నుంచి దర్శనం

ప్రొద్దుటూరు కల్చరల్ : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయాల నిర్వాహకులు బారీకేడ్లను ఏర్పాటు చేశారు. పాతమార్కెట్‌లో శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజాము 3 గంటల నుంచి భక్తులకు స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు. ముక్కోటి ఏకాదశి నాడు శ్రీమహావిష్ణువును దర్శిస్తే శుభప్రదమని, అర్ధరాత్రి నుంచి భక్తులు ఆలయాల వద్ద దర్శనం కోసం బారులు తీరుతారు. స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. ఆలయాన్ని పందిరి సెంటింగ్, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయం, అమ్మవారిశాలలో..

బొల్లవరంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శనం ఉంటుంది. స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా పూలతో అలంకరించనున్నారు. విశేషంగా ఉత్సవ మూర్తుల అలంకరణ, పల్లకీ సేవ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ చైర్మన్ గోనా ప్రభాకరరెడ్డి కోరారు. అలాగే శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో తెల్లవారుజామున అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేయనున్నారు. అమ్మవారి మూలవిరాట్‌ను వజ్రపు చీర, కిరీట ధారణలో అలంకరిస్తున్నారు. సహస్ర దీపాలంకరణ సేవ చేయనున్నారు. వైకుంఠం ద్వారం గుండా శ్రీలక్ష్మీ సమేత నారాయణ స్వామి దర్శనాన్ని భక్తులకు కల్పించనున్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు, అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్, రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, అర్బన్ సీఐ చలపతి, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసులు ఎమ్మెల్యే ఇంటిలో భారీ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఐసీడీఎస్ సీడీపీఓ, ఆయా మండలాలకు చెందిన మండల పరిషత్, రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యేను కలసి బొకేలు అందజేశారు. వీరితో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.


ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ వంశీధర్ గౌడ్, సీఐలు, ఎస్ఐలు

సుఖసంతోషాలతో జీవించాలి

రాజుపాళెం : ఏసుక్రీస్తు ప్రభువు దీవెనలతో అందరూ సంతోషంగా జీవించాలని పాస్టర్లు బాబు, సీమారాణి, అనిల్ ఆకాంక్షించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిల్లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజుపాళెంలోని చర్చిలో అర్ధరాత్రి కొవ్వొత్తులు పట్టుకొని ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం కానుకలు వేసి వాగ్దానాలు తీసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున రాజుపాళెంలో శిలువను ఎత్తుకొని కాలనీలోని ఇంటింటికీ తిరిగారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరం సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ జాన్‌ఫ్రాంక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవంతుని పట్ల విధేయులై జీవించాలన్నారు. సాటి వారి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని, చేతనైన సహాయం ఇతరులకు చేయాలన్నారు. క్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని చెప్పారు. నూతన సంవత్సరం అందరికీ శుభాలు తేవాలని ప్రార్థనలు చేశారు. భక్తిగీతాలు ఆలపించారు. వాగ్ధానం తీసుకుని కానుకను సమర్పించారు. సాయంత్రం వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. అలాగే పట్టణంలోని ఎస్‌పీజీ-1, 2, 3, ఆర్‌సీఎం, గోల్డన్‌జూబ్లీ తదితర చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ అమ్మ సీమారాణి


ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ జాన్‌ఫ్రాంక్

ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలు

మైదుకూరు : మైదుకూరులో కొత్త సంవత్సరం వేడుకలను ఆనందోత్సాహాలతో యువత జరుపుకొన్నారు. యువకులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ షాలోమ్ టౌన్ చర్చి, కృష్ణాపురం సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు శాంతి స్వరూప్, వైడీ ప్రసాద్, అరిన్ష్‌రాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గౌరవ ప్రదమైనది న్యాయవాద వృత్తి

ప్రొద్దుటూరు క్రైం : న్యాయవాద వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని సీనియర్ న్యాయవాది దాదాపీర్ తెలిపారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం పట్టణంలోని ముస్లిం న్యాయవాదులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీనియర్ న్యాయవాదులు దాదాపీర్, లాలాసాహెబ్, నూరుల్లా, ఆబిద్‌హుస్సేన్, జిలానిబాషాలకు సన్మానం చేశారు. అడ్వకేట్‌లందరూ కలిసి నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. త్వరలో అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు జిలానిబాషా తెలిపారు. కార్యక్రమంలో జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


సన్మాన గ్రహీతలతో న్యాయవాదులు

అంధులకు సేవ దైవకార్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : అంధులకు సేవ చేయడం దైవకార్యమని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక రాయలసీమ ఫర్నిచర్స్ వద్ద ఆదివారం గాజులపల్లె పెద్ద సుబ్బయ్య, పెద్ద సుబ్బమ్మ సేవాసంస్థ ఆధ్వర్యంలో అంధులకు పింఛన్ పంపిణీ చేశారు. సంస్థ తరఫున 40 మంది అంధులకు ఒక్కొక్కరికి రూ.200 అందజేశారు. అలాగే ఒక్కొక్కరికి సీబీఐటీ కళాశాల చైర్మన్ జయచంద్రారెడ్డి రూ.300, ఎస్‌బీఐ ఉద్యోగి వరదరాజులు రూ.100, భక్తపెంచలయ్య రూ.100, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమణయ్య, అబ్దుల్ రహిమాన్, భోజనప్యాకెట్స్, పబ్బతి శ్రీరాములు దుప్పట్లు, లింగయ్య బిస్కెట్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గురప్ప, గోవిందరాజులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


అంధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థికి బాసట

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం విద్యార్థికి చదువులకోసం ఆర్థికసాయం అందించింది. నగరానికి చెందిన విద్యార్థి లోకేశ్వర్ పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో వంద శాతం మార్కులతో ఉత్తీర్ణులై నీట్‌లో ర్యాంకు సాధించాడు. రేణిగుంటలోని బాలాజీ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు పొందారు. ఫీజులు, ఇతర ఖర్చుల కోసం కుటుంబ సన్నిహితుడు ఆనందరెడ్డి సహకారం కోరారు. ఆయన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు మేరువ బాలాజీరావు, డి.కార్తీక్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లడంతో వారు దాతల సహకారంతో రూ.70 వేలు సేకరించి ఆదివారం చెక్కు రూపంలో అందజేశారు. సాయం పొందిన విద్యార్థి, ఆయన తల్లి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాత్విక్, నిఖిల్, హర్షిత్, సాయితేజ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బద్వేలు అర్బన్ : బద్వేలులో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. శనివారం అర్ధరాత్రి నుంచే పట్టణంలో న్యూ ఇయర్ సందడి నెలకొంది. లక్ష్మిపాలెం సమీపంలోని పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయం, నెల్లూరురోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, తెలుగుగంగ కాలనీరోడ్డులోని దత్తసాయిబాబా ఆలయాలకు, చర్చిలకు భక్తులు పోటెత్తారు. వివిధ శాఖల అధికారులు తమ ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోవిడ్ మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో రాజకీయ ప్రముఖులు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు.

కాశినాయన : మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జ్యోతిక్షేత్రంలోని కాశినాయన సమాధిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జెడ్పీటీసీ డి.సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌రెడ్డి గౌడ్ విద్యార్థినుల సమక్షంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలిపారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్‌సీఐ నరేంద్రారెడ్డి, దువ్వూరు ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అర్బన్ పోలీసుస్టేషన్‌లో కేక్ కట్ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు


నూతన సంవత్సర వేడుకల్లో డీఎస్పీ వంశీధర్‌గౌడ్

చాపాడులో..

చాపాడు : మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య చేత ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, మండల పరిషత్, రెవెన్యూ అధికారులు కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే క్రమంలో జెడ్పీటీసీ జేష్టాది రాజిని కలసి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

బీమఠంలో భక్తుల సందడి


వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంస్వామిని దర్శించుకొనేందుకు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చారు. స్వామి దర్శనం అనంతరం ఈశ్వరీదేవిమఠం, బ్రహ్మంగారి నివాసం, పోలేరమ్మ, సాగర్‌ను భక్తులు సందర్శించారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

వెల్లాలలో..

రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రమైన శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, జీరెడ్డి సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండరును ఆవిష్కరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో ఆదివారం ఏపీ గణిత ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండరును కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణిత ఫారం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌కరీం, కోశాధికారి సంజీవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గౌస్‌మొహిద్దీన్, మధుసూధనరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్లేట్ల పంపిణీ


స్టీల్ ప్లేట్లు అందిస్తున్న ఖాదర్‌వల్లి, అఫ్జల్

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్‌లో ఆదివారం పండ్ల వ్యాపారి ఖాదర్‌వల్లి (దస్తుమియా అండ్ సన్స్) ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ దివ్యాంగులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆల్‌ఆఫ్‌యా దివ్యాంగులు అండ్ వయోవృద్ధుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ దొడియం అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు, రషీద్, దస్తగిరి, సావిత్రి, మల్లీశ్వరి, యదార్థుడు, కొండమ్మ, లక్ష్మి, యూసఫ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు అందజేత


దుప్పట్లు అందిస్తున్న షాకీర్‌హుసేన్, లక్ష్మీకిశోర్

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 50 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దాత సురేష్ సహకారంతో దుప్పట్లు అందించినట్లు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్ తెలిపారు. కార్యక్రమంలో బదిరుల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకిశోర్, మహ్మద్‌బాషా, ఉపాధ్యక్షుడు అల్తాఫ్, వెంకటసుబ్బయ్య, పవన్, కేశవ, హనుమంతు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలోని తాళ్లమాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శౌరెడ్డిపల్లెలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడగపడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి ఆసరా లేని వృద్ధులు, యాచకులకు జన వికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. సేవా సమితి అధ్యక్షులు తాహీర్, ప్రతినిధులు వాలేపు శివ, మస్తాన్ వలీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.